క్లుప్తంగా

మైనార్టీ కళాశాలలో అడ్మిషన్లు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ లాల్ హట్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రతీ గ్రూప్‌లో 40 సీట్ల చొప్పున మొత్తం 80 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో 51 సీట్లు మైనార్టీ విద్యార్థులకు, 5 సీట్లు క్రిస్టియన్లకు, జైనులు, బౌద్ధులు, పార్సీలు, సిక్కులకు ఒకొక్క సీటు, ఎస్సీ-05, ఎస్టీ-03, బీసీ-10, ఓసీ-02 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. అడ్మిషన్ కోసం ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మార్కుల జాబితాలతో ఈ నెల 3 (నేడు) నుంచి 11లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

5న ఎంసెట్ మోడల్ పరీక్ష

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ కళాశాలలో ఈ నెల 5న మోడల్ ఎంసెట్ పరీక్షను నిర్వహించనున్నట్లు లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థుల కోసం మోడల్ ఎంసెట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు 8374324410, 9666288170 నంబర్లను సంప్రదించి కావలసిన సమాచారాన్ని తెలుసుకోవచ్చని ఆయన సూచించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మినరల్ వాటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. ఈ కేంద్రాన్ని సత్తుపల్లి ఆర్టీసీ డీపో మేనేజర్ రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీపో మేనేజర్ మాట్లాడుతూ.. క్షత్రియ సేవా సమితి బాధ్యులు కునాథరాజు సోమరాజు–గంగా భవాని దంపతులను అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ నార్లపాటి సునీత, సేవా సమితి సభ్యులు పెన్మాత్స మురళి, ప్రసాద్‌రాజు, గొట్టిముక్కల సత్యనారాయణ రాజు(చంటి), కృష్ణంరాజు, విజయలక్ష్మి, భూపతిరాజు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల గ్రామ పంచాయతీ గోవిందపురం గ్రామంలో చర్ల, దుమ్ముగూడెం రెండు మండలాల కొమరం భీమ్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ స్థానిక ఎంపీటీసీ తెల్లం భీమరాజు పాల్గొని క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచ్ చాట్ల మిత్ర, కాంగ్రెస్ నాయకులు సరియం వీర్రాజు, నక్కకృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు తెల్లం హరికృష్ణ, కొమరం గజేందర్, కాగితాల శివ, చింతం రమేష్, కొమరం భీమ్ క్రికెట్ టోర్నమెంట్ మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతి

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. గత కొద్ది నెలలుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న భాస్కరరావు.. గురువారం సాయంత్రం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఇంటివద్దనే మృతి చెందారు. మరణవార్త తెలుసుకున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావులు గురువారం రాత్రి దమ్మపేటలో మృతుడి భౌతిక కాయాన్ని సందర్శించి, పూలతో నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విద్యార్థులకు అభినందన

దమ్మపేట: అశ్వారావుపేట మండలంలోని జవహర్ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ఇటీవల ప్రకటించిన పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచగా, ఆ విద్యార్థులను, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభినందించారు. గురువారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో అశ్వారావుపేట జవహర్ విద్యాలయ నిర్వాహకులతో పాటుగా విద్యార్థులు, ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన పల్లవితో పాటుగా, 9.5 జీపీఏ సాధించిన గీతాంజలి, చైత్రికలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. అన్నదాత మందలపు రామనాథం దంపతులు, వారి కుమారులు నాగేశ్వరరావు–శ్రావణి దంపతులు, సురేష్–శ్రావణి దంపతులు, మనువళ్ళు లోకేష్, ఖుషిల్, యోగేష్, వేణులు సాయినాథుని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో పల్గొన్నారు. దాతలను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

డంపింగ్ యార్డు రెడీ..

- భద్రాచలంలో ఏళ్ల నాటి సమస్యకు చెక్
- త్వరలో అందుబాటులోకి రానున్న డంపింగ్ యార్డు
- ఎనిమిది ఎకరాల్లో రూ.80 లక్షలతో ఏర్పాటు



చివరి దశకు చేరిన డీఆర్‌సీసీ షెడ్ల నిర్మాణం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో గోదావరితో పాటు పట్టణ ప్రజలకు శాపంగా మారిన చెత్త, కాలుష్యం సమస్యకు విముక్తి లభించనుంది. పదేళ్లుగా ఇక్కడ డంపింగ్ యార్డు కలగానే మిగిలిపోగా... పట్టణ శివారులోని మనుబోతుల చెరువు సమీపాన ఎనిమిది ఎకరాల స్థలంలో చేపట్టిన నిర్మాణం తుది దశకు చేరింది. మరో ఇరవై రోజుల్లో డంపింగ్ యార్డు అందుబాటులోకి రానుంది. దీంతో గోదావరి కరకట్ట వెంట చెత్తాచెదారం వేస్తుండడంతో ఏర్పడుతున్న కాలుష్యం సమస్య తీరనుంది.

ఎనిమిది ఎకరాల్లో డీఆర్‌సీసీ

భద్రాచలం గ్రామపంచాయతీ ఆధ్వర్యాన రూ.80లక్షల వ్యయంతో ఎకరం స్థలంలో డీఆర్‌సీసీ(డ్రై వేస్ట్ రిసోర్స్ కలెక్టింగ్ సెంటర్) నిర్మిస్తున్నారు. ఇందులో రూ.45లక్షలతో వర్మీ కంపోస్టు, రూ.35లక్షలతో డీఆర్‌సీసీ షెడ్ల నిర్మాణం జరుగుతోంది. కాగా డంపింగ్ యార్డులో క్రషింగ్ మిషన్లను రావాల్సి ఉంది. ప్రస్తుతం భద్రాచలం పట్టణంలోని 19 వార్డుల నుంచి 30 పంచాయతీ వాహనాల ద్వారా రోజూ 15 టన్నుల మేర పొడి, తడి చెత్త సేకరిస్తున్నారు. కాగా, కొత్తగా ఏర్పాటుచేసే డంపింగ్ యార్డులో పొడి చెత్తను వేరు చేసి క్రష్ చేసే రూ.40లక్షల విలువైన యంత్రాన్ని ఐటీసీ పేపర్ పరిశ్రమ ఇవ్వనుంది. ఇతర నిర్మాణాలకు రూ.40 లక్షలను గ్రామపంచాయతీ వెచ్చిస్తోంది. ఇవేకాక డంపింగ్ యార్డుకి కావాల్సిన ఇతర యంత్రాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రూ.కోటి వ్యయంతో కొనుగోలు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా డంపింగ్ యార్డు కోసం అందుబాటులో ఉన్న ఎనిమిదెకరాల్లో ఎకరన్నర మేర నిర్మాణాలకు ఉపయోగించి.. మిగిలిన స్థలంలో విస్తృతంగా మొక్కల పెంపకం చేపడుతారు. కాగా, యార్డు అందుబాటులోకి వస్తే దాదాపు 50 మంది వరకు ఉపాధి లభిస్తుంది.

ఎన్నో ఏళ్లుగా సమస్య

2014లో రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం పట్టణం మాత్రమే మిగలగా చుట్టూ ఉన్న ప్రాంతమంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనమైంది. అప్పట్లో భద్రాచలంలో సేకరించే చెత్తను సరిహద్దున ఉన్న ఎటపాక మండల కేంద్రంలో డంప్ చేసేవారు. రాష్ట్ర విభజన అనంతరం అక్కడి ప్రజలు చెత్త డంపింగ్‌ను అడ్డుకోవడంతో కూనవరం రోడ్డులో డంపింగ్ యార్డు కోసం ఎకరం స్థలం కేటాయించినా అక్కడి రైతులు వ్యతిరేకించారు. ఆపై భద్రాచలంలో సేకరించే చెత్తను డంప్ చేసేందుకు బూర్గంపాడు మండలం సారపాకలోని మణుగూరు క్రాస్ వద్ద కొంత స్థలం గుర్తించినా స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. అనంతరం భద్రాచలంలోని మనుబోతుల చెరువు వద్ద స్థలం కేటాయించినా గిరిజనుల నుంచి అభ్యంతరం రావడంతో డంపింగ్ యార్డు నిర్మాణం ముందుకు సాగలేదు. చివరకు చెత్తను గోదావరి కరకట్టపై ఏర్పాటు చేసిన తాత్కాలిక డంపింగ్ యార్డు వద్దకు చేర్చి తగలబెడుతండడంతో ఇటు స్థానికులు ఇబ్బంది పడుతుండడమే గోదావరి జలాలు కాలుష్యమయ్యే పరిస్థితి నెలకొంది.

యార్డుతో పంచాయతీకి ఆదాయం

భద్రాచలంలో డంపింగ్ యార్డు అందుబాటులోకి వస్తే గ్రామపంచాయతీకి సైతం ఆదాయం సమకూరనుంది. ఇక్కడ చెత్తను కాల్చి పొడిగా మార్చే యంత్రాల అమర్చనుండగా.. ఈ పొడిని రైతులు, నర్సరీల నిర్వాహకులు, ఇటుక బట్టీ నిర్వాహకులకు అమ్మనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం భద్రాచలంలో రోజు వారీ 15 వేల టన్నుల చెత్త సేకరిస్తుండగా.. ఇది కాలిస్తే వచ్చే పొడి అమ్మకం ద్వారా గ్రామపంచాయతీకి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తుందని అంచనా. కాగా, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ చొరవతో నాలుగు నెలల వ్యవధిలో డంపింగ్ యార్డు నిర్మాణం పూర్తయింది. గతంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మధ్యలో నిలిపివేసే పరిస్థితి రాగా.. పీఓతో పాటు ఈఓ శ్రీనివాస్ చొరవతో నిర్మాణం చివరి దశకు చేరింది.

త్వరలోనే అందుబాటులోకి..



ఏళ్లుగా పట్టణ ప్రజలకు సమస్యగా ఉన్న డంపింగ్ యార్డును ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ చొరవతో నాలుగు నెలల్లోనే పూర్తి చేశాం. మరో ఇరవై రోజుల్లో అందుబాటులోకి తీసుకుని వస్తాము. పొడి, తడి చెత్తను వేరు చేసేలా డీఆర్‌సీసీ షెడ్ల నిర్మాణం జరుగుతుంది. చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేయనున్నాం. తద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది.

– సీహెచ్.శ్రీనివాస్,
గ్రామపంచాయతీ ఈఓ, భద్రాచలం

మలేరియా స్క్రీనింగ్ సర్వే


దుమ్ముగూడెం: రక్తనమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో గురువారం మలేరియా మాస్ స్క్రీనింగ్ సర్వే చేపట్టారు. మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలోని నారంగుంపు గ్రామంలో 105, బండారుగుంపు గ్రామంలో 206, అలాగే గుమ్మడవల్లి పీహెచ్‌సీ పరిధిలోని కొత్త కావడిగుండ్ల గొత్తికోయల కాలనీలో 62 మంది మలేరియా నిర్ధారణ కోసం రక్త నమూనాలను సేకరించారు. వీరిలో ఇద్దరికి జ్వర లక్షణాలు లేకుండానే, మలేరియా నిర్ధారణ అయినట్లు సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు తెలిపారు. కాగా మలేరియా నిర్ధారణ అయిన వారిద్దరికి వైద్య సేవలు అందిస్తున్నామని, జ్వరాలో వస్తే నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమాల్లో హెచ్ఈఓ రాజు, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, రవి, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు బేబినాంచారి, రాములమ్మ, ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని వైట్‌నాగరం గ్రామంలో డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో ఎసెంటమేటిక్ ఫీవర్ సర్వేను గురువారం నిర్వహించారు. గ్రామంలోని 105 రక్త నమోనాలను వైద్య సిబ్బంది సేకరించారు. ఎవరికీ మలేరియా లక్షణాలు లేవని తెలిపారు. రక్త నమోనాలను ల్యాబ్‌కు పంపించామని, లక్షణాలు లేకుండా మలేరియా కేసులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి ముందస్తుగా మందులు ఇస్తామని డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ బాబురావు, ఏఎన్ఎం పద్మ,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ములకలపల్లి: ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి, కూలీల వేతనాలను పెంచి, సమస్యలను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గుట్టగూడెం, మామిళ్లగూడెం గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల సమస్యలపై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కొలతలతో నిమిత్తం లేకుండా కూలీలకు రోజుకు సగటున వేతనంగా రూ.750లు చెల్లించి, ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు సవాల ఆదినారాయణ, నాగరాజు, వంకా సురేష్, అక్కమ్మ, లక్ష్మి, సరస్వతి, రాఘవమ్మ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

దమ్మపేట: పెనుబల్లి మండల ఎంపీపీ భర్త లక్కినేని వినీల్‌తో పాటుగా మరికొందరు బీఆర్ఎస్ నాయకులు గురువారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను కలిశారు. వీరు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరే నిమిత్తం మంత్రిని కలసినట్టు విశ్వసనీయ సమాచారం. దమ్మపేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కూడా తుమ్మలను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా పనిచేసి, ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో దమ్మపేట నాయకులు ఎల్లిన రాఘవరావు, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, కేవీ. సత్యనారాయణ, దొడ్డా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి దిబ్బలు


నడిరోడ్డుపై పోసిన మట్టి కుప్పలు

దమ్మపేట: పంచాయతీ అధికారుల నిర్వాహకం వల్ల రోడ్డుపై రాకపోకలకు వీలు లేకుండా పూర్తిగా నిరుపయోగకరంగా మారింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నుంచి అర్బన్ కాలనీకు వెళ్లడానికి మట్టి రోడ్డు ఉంది. ఈ రోడ్డు నుంచి రాంజీ కుంట(చెరువు) కట్ట మీదుగా అర్బన్ కాలనీకు వెళ్లడానికి మార్గం ఉంది. దీనిగుండా స్థానికులు కాలి నడకన, ద్విచక్ర వాహనాలు, తేలికపాటి వాణిజ్య వాహనాలతో ప్రయాణిస్తుండేవారు. కాగా నెల రోజుల కిందట ఈ మట్టి రోడ్డుకు ఒక పక్కన లోతుగా డ్రెయినేజీ గోతిని తవ్వారు. ఆ మట్టిని అదే రోడ్డుపై గుట్టలు గుట్టలుగా పోశారు. ఆ మట్టి గుట్టలుగా రోడ్డుపై ఉండి నెలరోజులు కావస్తోంది. ఇప్పటికీ మట్టిని చదును చేయడం గానీ, తొలగించడం గానీ పంచాయతీ అధికారులు చేయలేదు. కనీసం ప్రమాదపు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. పరిధిని దాటి తవ్వడం వల్ల రోడ్డు వెడల్పు తగ్గడమే గాక రోడ్డుపై గుట్టలుగా వేసిన మట్టి వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు అదే రోడ్డు మీద మట్టి గుట్టలపై జాగ్రత్తగా అడుగులు వేస్తూ, నడుస్తూ వెళ్తున్నారు. చిన్నపిల్లలు తెలియక, రాత్రి వేళల్లో పెద్దలు ప్రమాదవశాత్తు డ్రెయినేజీ గోతిలో పడితే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

కేసు నమోదు

ములకలపల్లి: అసభ్య పదజాలంతో మహిళను దూషించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలపరిధిలోని కమలాపురం గ్రామానికి చెందిన మహిళను.. అదే గ్రామానికి చెందిన కొందరు యవకులు అసభ్యపదజాలంతో దూషించారు. ఏప్రిల్ 26వ తేదీన మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవేశించి దూషణకు తెగబడ్డారు. కాగా బాధిత యువతి గురువారం పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు శిక్ష

దమ్మపేట: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి, రెండు రోజల జైలుశిక్షను జడ్జి విధించారు. గురువారం దమ్మపేటలోని జూనియర్ సివిల్ జడ్జి కమ్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో జరిగిన న్యాయ విచారణలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి, రెండు రోజల శిక్షను జడ్జి రామారావు విధించారు. ఈ కారణంగా ప్రతి ఒక్కరూ డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి, మద్యం తాగిన మత్తులో వాహనాలు నడపవద్దని, నడిపితే చర్యలు తప్పకుండా ఉంటాయని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి హెచ్చరించారు.

విడుదల చేయాలి

దుమ్ముగూడెం: బీఆర్ఎస్ సోషల్ మీడియ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణా రాష్ట్ర సాధన విద్యార్థి ఉద్యమకారుడు మన్నే క్రిశాంక్ అక్రమ అరెస్టును ఖండించాలని, ఆయనను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు దామెర్ల శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అరాచక పాలనలను, అబద్ధపు వాగ్దానాలను ప్రజాస్వామ్య బద్ధంగా ప్రశ్నిస్తున్న వారిని ఇలా అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు.

చలివేంద్రం ప్రారంభం

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధి అంబేడ్కర్ సెంటర్‌లో తెలంగాణ టీజేఏసీ మండల మాజీ అధ్యక్షుడు, మున్నూరుకాపు సంక్షేమ సంఘం పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ వలసాల వెంకటరామారావు.. ఆయన తల్లిదండ్రులు స్వర్గీయ వలసాల జగ్గారావు–పద్మావతిల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండల కార్యదర్శి గాండ్ల సురేష్, పోట్ల ముత్తయ్య, శ్రీనివాస్, వనం సత్యనారాయణ, దాచే పల్లి శ్రీనివాస్, యూత్ నాయకులు పోట్ల శేఖర్, మిరియాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సమావేశం

దమ్మపేట: తెలుగుదేశం ముఖ్య నాయకుల సమావేశాన్ని మండల కేంద్రం దమ్మపేటలో నియోజకవర్గ నాయకులు కట్రం స్వామిదొర అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుతం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకు మద్దతు ఇవ్వాలి అనే అంశంపై చర్చలు జరిపారు. రెండు మూడు రోజుల్లోనే ఏ పార్టీకు మద్దతు ఇచ్చే విషయంపై స్పష్టత ఇస్తామని నాయకులు తెలిపారు.

‘రఘురాం’ గెలుపుతోనే అభివృద్ధి


అశ్వారావుపేటరూరల్: ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే, మంత్రి సతీమణి మాధురి రెడ్డి

అశ్వారావుపేటరూరల్: ఖమ్మం జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామసహాయం రఘురాం రెడ్డిను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సతీమణి మాధురి రెడ్డి అన్నారు. గురువారం వారు మండలంలోని ఆసుపాక, మామిళ్లవారిగూడెం, కొత్త మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, తిరుమలకుంట కాలనీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి సతీమణి ఆయా గ్రామాల్లోగల ఆలయాలను సందర్శించి ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డి విజయం సాధించాలని పూజలు చేశారు. అనంతరం ఓటర్లను కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ఎన్నికల ప్రచారంలో సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరావు, తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, జ్యేష్ఠ సత్యనారాయణ, కునసోతు లింగయ్య, బండి చెన్నారెడ్డి, పసుపులేటి రాము, సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలవుతాయి

ములకలపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో ప్రకటించిన ఆరుగ్యారెంటీలు పక్కాగా అమలవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి అన్నారు. ములకలపల్లి, జగన్నాథపురం, పూసుగూడెం జీపీ కేంద్రాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలసి గురువారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ప్రధాన కూడళ్లలో కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, పేటేటి నర్సింహారావు, కారం సుధీర్, గాడి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటి వద్దే ఓటు

భద్రాచలంఅర్బన్: పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేక వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేయలేకపోతున్నారు. ఈ నేపథ్యాన గత అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం హోం ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. మంచి ఫలితాలు రావడంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ అమలుకు సిద్ధమయ్యారు. భద్రాచలం నియోజకవర్గంలో వృద్ధులు, దివ్యాంగులు కలిపి 81 మంది ఉండగా.. వీరు ఇంటి వద్దే ఓటు వేసేలా ఏర్పాట్లు చేసినట్లు భద్రాచలం ఏఆర్ఓ దామోదర్‌రావు తెలిపారు. కాగా, శుక్ర, శనివారాల్లో హోం ఓటింగ్ నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో సూక్ష్మ పరిశీలకుడు, సెక్టోరల్, పోలింగ్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, పోలీస్, వీడియో గ్రాఫర్లు ఉంటారు. ఈ బృందాలు దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగుల ఇంటికివెళ్లి పోలింగ్ కేంద్రం మాదిరిగానే ఏర్పాట్లు చేసి ఓటింగ్ నిర్వహిస్తారు.

పూర్వ వైభవం తీసుకొద్దాం


ఆలయంలో సమావేశమైన అర్చకులు

దుమ్ముగూడెం: మండలంలోని పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి అర్చకులు తమ వంతు కృషి చేయాలని అర్చక సంఘ ఉపఅధ్యక్షుడు రాజగోపాలా చార్యులు, ఈసీ సభ్యులు రాఘవ శర్మలు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో శ్రీదాసాంజనేయ స్వామి ఆలయంలో అర్చక సంఘం ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభయాంజనేయ స్వామి విగ్రహాలను ప్రతి గ్రామంలో ప్రతిష్ఠాపన చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాలలో స్వయంగా మండల అర్చకులు తమ సొంత ఖర్చులతో పూజ కార్యక్రమాలు జరుగునట్లు సంకల్పన చేసుకున్నట్లు తెలియచేశారు. అర్చకులు యశ్వంత్ శర్మ, నూతన శర్మ, హేమంత్ శర్మ, చిన్న అరుణాచల ఆలయ సంకల్పకర్త శివ నాగ స్వామి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



దమ్మపేటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


దమ్మపేట: ఎన్నికల నిబంధనలను అతిక్రమించి, విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవని, అశ్వారావుపేట సీఐ జితేందర్ రెడ్డి, దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించాలని కోరుతూ.. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి మల్లారం రోడ్డు వరకు పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌లో సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి గొడవలకు తావులేకుండా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. అందుకోసం రాజకీయ నాయకులు, స్థానికులు, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మార్చ్‌లో అశ్వారావుపేట ఎస్సై శ్రీరామ్ శ్రీనివాస్, ములకలపల్లి ఎస్సై రాజమౌళి, సీఆర్పీఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

లౌకికశక్తులకు సంపూర్ణ మద్దతు

అశ్వారావుపేటరూరల్: లౌకిక శక్తులకు మద్దతు ఇచ్చేందుకే భాగస్వామ్య పార్టీలు కాంగ్రెస్ పార్టీని బలపరుస్తున్నట్లు సీపీఎం జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. గురువారం మండలంలోని నందిపాడు గ్రామంలో పార్టీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం పూర్తి స్థాయిలో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న రఘురాం రెడ్డికి మద్దతు ఇస్తోందని, పార్టీ శ్రేణులంతా గమనించి ఎంపీగా ఆయనను గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు బి.చిరంజీవి, వీరాస్వామి పాల్గొన్నారు.

సాగుకు అందని నీరు

- మరమ్మతులంటూ చెరువు తూముకు తాళం
- చేపల వేటకు మాత్రం గోదారిలో వదిలిన నీరు
- చేలు ఎండాయంటూ రైతుల ఆందోళన


పేరంటాల చెరువు తూము నుంచి గోదావరికి తరులుతున్న నీరు

మణుగూరుటౌన్: ప్రతిష్ఠాత్మకమైన పేరంటాల చెరువు తూము మరమ్మతుకు నోచుకోవడంతో సాంబాయిగూడెంలోనే ఉన్న పేరంటాల చెరువు ఆ గ్రామ ప్రజలే వాడుకోలేకపోతున్నారు. దీంతో పంటలు సగం మాత్రమే చేతికి వచ్చిన పరిస్థితి. పేరంటాల చెరువు సొసైటీలో చేపలు పట్టేందుకు మాత్రం కొందరు చెరువు తూముకు హుటాహుటిన మరమ్మతులు చేసి గోదావరికి నీరు విడుదల చేశారు. దీనివల్ల జీవాలకు నీరు లేకపోవడంతో పాటు దమ్మక్కపేట, రామానుజవరం, పగిడేరు, సాంబాయిగూడెం గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటుతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పినపాక నియోజకవర్గంలో రెండో పెద్ద చెరువుగా, మణుగూరు మండలంలో పెద్ద చెరువుగా ఉన్న పేరంటాల చెరువు 200 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 1100 ఎకరాల ఆయకట్టుగా ఉంది. కాగా సాంబాయిగూడెంలో ఉన్న చెరువు నుంచే దమ్మక్కపేట, రామానుజవరం పొలాలకు నీరు వెళ్తుండటంతో పాటు సాంబాయిగూడెంలోని 350 ఎకరాలకు అదే ఆదరువు. ఈ నేపథ్యంలో గతేడాది తూము మరమ్మతులకు నోచుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చూపారు. స్థానికుల వినతుల మేరకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి తూము నుంచి లీకేజీ లేకుండా మట్టి, ఇసుక బస్తాలు ఉంచి త్వరలో సమస్య పూర్తిగా పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కాగా నేటికీ మరమ్మతులు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో చెంతనే చెరువు ఉన్నా స్థానిక పొలాలకు నీరు పారక పొలాలు పూర్తిగా ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో చేపల సొసైటీ ఆధ్వర్యంలో పేరంటాల చెరువులో వేసిన జలపుష్పాలను పట్టేందుకు గురువారం తూము పూడిక తీసి నీటిని గోదావరికి వదిలి చేపల వేట ప్రారంభించారు. ఈ రీతిగా తరచూ తమ పొలాలకు నీరు వదిలినా తమ పంట చేతికివచ్చేదని, చేపల వేటకు మాత్రం గోదావరిలోకి నీటిని విడుదల చేశారని స్థానికులు ఆవేధన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు, మత్స్య శాఖఅధికారులు సమన్వయంతో సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.